

రైలు కూత వినవడుతూంది దూరంగా. భాస్కరం పెట్టె చేతపుచ్చుకుని ముందుకి అడుగులు వేశాడు. . . రైలు ఆగకుండా వెళ్లిపోయింది. అది తను ఎక్కవలసిన రైలు కాదు. తిరిగి వెనక్కి వెళ్లి యథాప్రకారం రాతిబెంచీమీద కూలబడ్డాడు. ఇంకా తెల్లవారలేదు పూర్తిగా. కాకులు కావు కావుమని అరుస్తున్నాయి. సూర్యుడు మెల్లిమెల్లిగా చీకట్లను చీల్చుకుని లోకం దృష్టిలోకి వస్తున్నాడు. . .

నిట్టూర్చాడు భాస్కరం... తమ ఇద్దరి జీవితాల్లోను ఇంక సూర్యోదయం లేదు. చీకటి నిండి ఉంది. . . కారు చీకటి. . . అతని మనసు గతాన్ని తవ్వుతూంది.

● ● ●

"మామయ్య వచ్చాడు, మామయ్య వచ్చాడు. . . అంటూ పిల్లలు అరుచుకుంటూ వెళ్లి తల్లికి చెప్పి వచ్చారు. కామాక్షి చేస్తున్న పని వదిలివేసి చిరునవ్వుతో హాల్లోకి వచ్చింది. కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకుంటున్న భాస్కరాన్నిచూసి "ఏమోయ్ కులాసానా? ఎప్పుడు బయలుదేరావు, ఏమిటీ?" అంది కాళ్లు కడుక్కోవటానికి నీళ్లు ఇస్తూ.

"నిన్ననే వచ్చానులే. . . ఇక్కడికి పొద్దుట బయలుదేరాను."

"అమ్మావాళ్లంతా కులాసానా?"

"ఊఁ" కాళ్లు కడుక్కుని లోపలికి వచ్చాడు.

"నీ ఉత్తరం మొన్ననే అందింది. మళ్లీ దూరం వెళ్లిపోతావు అసలు చూడటానికైనా వీలుంటుందో, ఉండదో. . ." కామాక్షి అంటూంది. దొడ్లోనించి వస్తున్న భామ తల్లిమాటలు వింటూ ఇవతలకు వచ్చింది.

"ఏం భామా, కులాసానా?" ప్రశ్నించాడు.

"మువ్వు వెళ్లటం ఎప్పుడు మామయ్యా?"

"ఇంకా తేలలేదు. బహుశః [illegible]. . ." పుస్తకం తిరగేస్తూ అన్నాడు భాస్కరం.

భామ ఇంకేం మాట్లాడకుండా నుంచుంది. . .

కామాక్షి తమ్ముడు భాస్కరం. స్వయానా ఒక కడుపున పుట్టినవాళ్లే అయినా వాళ్లిద్దరిలోనూ ఎంతో తేడా ఉంది. కామాక్షికి తమ్ముడంటే విపరీతమైన అభిమానం. తనకన్న పది సంవత్సరాలు చిన్న కావటం ఒకటీ, తమ వంశానికల్లా ఒక్కడే మగ సంతానం కావటం ఒకటీ ఆమె అభిమానానికి కారణాలయ్యాయి. అతనికి వయసు వస్తున్నకొద్దీ ఆ అభిమానం మరింత పెరిగింది. దానికీ కారణం లేకపోలేదు. కాపరానికి వెళ్లిన ఏడాదికే ఆడపిల్లని కని పురిటిలోనే పోగొట్టుకుంది కామాక్షి. ఆమె విచారానికి అంతులేదు. ఆ తరవాత మళ్లీ చాలాకాలానికి గానీ ఆమె కడుపు ఫలించలేదు. ఆమె ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. చాలాకాలానికి ఆమె కన్నకలలు ఫలించాయి. భామ, భామ తరవాత మురళి [illegible].

చివరికి అతి బలహీనత కారణంగా, డాక్టర్ల సలహామీద పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవలసి వచ్చింది. ఇంక పిల్లలుపుట్టే ఆశ లేకపోయినా అంతలోనే సంతృప్తి పడ్డారు కామాక్షి, ఆమె భర్తాను. భాను పుట్టాక కామాక్షిలో ఆశ తిరిగి చిగురించింది. భాను పెద్దదవుతున్నకొద్దీ ఆమె అతనిమీద ఆశలు పెంచుకోసాగింది. ఉన్నది ఒక్క తమ్ముడు. తనకీ ఇంక పుట్టే గీత లేదు. తల్లీ, తండ్రీ తన మాట కాదనరు. వాడికి మాత్రం చిన్నప్పట్నించీ తనమీద ఎంత అభిమానం! తన మాట ఎందుకు తీసేస్తాడు? ఈ ధైర్యంతో ఉన్నది కామాక్షి. భాస్కరం బావగారికి కూడా మొదట్లో బావమరిదిమీద ఏమంత సదభిప్రాయం లేకపోయినా అతను పెద్ద చదువులు చదవటం, అందరి మన్ననలూ అందుకోవటం, ఇదంతా చూసి ఆయన తన అభిప్రాయం మార్చుకున్నాడు. ముఖ్యంగా అతను చదువుకోవటానికి విదేశాలకు వెడుతున్నాడని తెలిసినప్పట్నించీ, 'మా భాను అదృష్టవంతురాలు' అనుకోవటం వరకూ వచ్చింది. భానుకి చిన్నతనంనించీ మామయ్యమీద ప్రత్యేకమైన అభిమానం. అతనిమీదే మనసు నిల్పుకొని, అతన్నే ప్రేమించిందీ అని చెప్పటానికి వీల్లేక పోయినా, తనెంటే అతడు ఆపేక్ష కనబరుస్తాడు. తనతో ఆదరంగా మాట్లాడుతాడు. ఇవే చాలా ఆమె చిన్న హృదయాన్ని ఆకర్షించటానికి. రోజులు గడుస్తున్నకొద్దీ, వయస్సు వస్తున్నకొద్దీ తల్లిదండ్రులు అనే మాటలవల్లా, వారు విసిరే చలోక్తులవల్లా తనకూ, మామయ్యకూ మధ్య ఉత్త ప్రేమానురాగాలే కాక అంతకుమించిన అనుబంధమేదో ఉన్నదనిపించింది. లేతవయసులో ఆమెలో ప్రవేశించిన అనురాగబీజం ఇంతై, అంతై వయసు వచ్చేసరికి ఆమెలో ఆమెకు తెలియకుండానే భాస్కర్ని ఆరాధించసాగింది.

• • •

"స్నానానికి నీళ్ళు తోడాను." భానువచ్చి పిలుస్తుంటే భాస్కరం లేచాడు. భాస్కరం రెండు రోజులుండి తిరిగి వెళ్లటానికి ప్రయాణమయ్యాడు. తమ్ముడు ఉన్న రెండు రోజులూ అసలు విషయం ఎత్తటం ఎలాగా అని మథనపడి, పడి తీరా అతను వెళ్ళిపోయాక, అడిగితే బాగుండేదని నొచ్చుకుంది. ఉండలేక భర్తతో గట్టిగా చెప్పింది:

"అమ్మాయి పెద్దదవుతోంది. వాడి చదువూ ఈ యేటితో సరి. మీరు మరీ అలా పట్టించుకోకుండా ఊరుకుంటే ఎలా? ఎంతైనా ఆడపిల్లని కన్నవాళ్లం. మీరు వెళ్లి మా నాన్నని అడిగిరండి."

సుబ్బారావు భార్యవేపు చూస్తూ, "మీ అక్కా తమ్ముళ్ల సంబంధం. మధ్యలో నేనెందుకు?" అన్నాడు.

"అలా కాదు. మీరు వెళ్లి అడిగితే బావుంటుంది..." కామాక్షి మనసులో మాట చెప్పింది.

సుబ్బారావు భార్యమనసు అర్థం చేసుకుని మామగారి దగ్గిరికి వెళ్లాడు. అసలు విషయం కదిపాడు.

భాస్కరం తండ్రి ఒక్క క్షణం మౌనంగా ఉండి,

"ఈ సంగతి వాడితో ముఖాముఖిగా తేల్చుకుంటే వాడి అంగీకారమైతే నా కేమీ అభ్యంతరం లేదు" అని ఒక్క ముక్కలో చెప్పాడు. సుబ్బారావు అర్థంగానట్టు చూశాడు. బావమరిదిని పక్కకు పిల్చాడు.

*ఆశయాలను సాధించడమూ, సాధించలేనపుడు పరిస్థితులతో రాజీపడడమూ అందరికీ సాధ్యం కాకపోవచ్చు. తాను ప్రేమించిన వ్యక్తిని మూగగా ఆరాధించే ముగ్ధ, విధి ఎదురునిలిచినప్పుడు, గుండె రాయి చేసుకుంటుంది. ఆ రాతిని కరిగించడం, ఆ ఆరాధనామూర్తికి కూడా సాధ్యంకాదు. — అప్పుడు జీవితం సజీవసమాధి అయినట్లే, యిద్దరికీ.*

"మీ నాన్నగారు అలా అంటారేమిటి?"

"ఇప్పుడు పెళ్లికేం తొందర?" అన్నాడు భాస్కరం.

"నీకు లేకపోవచ్చును గానీ, మేము ఆడపిల్లని కన్నవాళ్లం..." అతని ధోరణి సుబ్బారావులో చికాకు కలిగిస్తోంది.

మనసులో గుద్దులాట దేని కనుకున్నాడు భాస్కరం.

"భానుకి చేసెయ్యండి. నా కిప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదు."

"అంటే నీ ఉద్దేశం. . ." సుబ్బారావులో కోపం పొంగుకు వస్తోంది.

వాద ప్రతివాదాల ఫలితంగా తేలిన సంగతేమంటే, తనకి భానుని చేసుకోవటం ఇష్టం లేనట్టు తేల్చి చెప్పాడు భాస్కరం. సుబ్బారావులో ఆగ్రహం ఉప్పెనలా పొంగింది. కానీ ఆ క్షణంలో ఏమీ చెయ్యలేని అసహాయుడే అయ్యాడు. మరేమీ తర్కించక ఇంటికి వచ్చి భార్యమీద విసిరాడు.

"అంతా నీ చేతుల్లో ఉన్నట్టు మాట్లాడుతావు! ముసలాయన్ని అడిగితే కొడుకుని కనుక్కోమంటాడేమిటి?" తనకీ, భాస్కరానికీ జరిగిన సంభాషణ చెప్పదలుచుకోలేదు ఆయన.

కామాక్షి మౌనంగా విని ఊరుకుంది. చివరికి "మీరు భాస్కరంతో మాట్లాడలేదు గదా! వాడి మనసు నాకు తెలుసు. . ." అంది ధైర్యంగా.

భార్య అమాయకత్వానికి జాలి పడ్డాడు సుబ్బారావు. ఆయన మనస్సు చాలా చికాకు పడింది. "ఇన్నాళ్లూ ఇన్ని ఆశలు పెట్టి ఇప్పుడిదేమి నాటకం?. . ."

• • •

భాస్కరం ఆఖరి ఏడు పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. కామాక్షికి తమ్ముణ్ణి చూడగానే మనసులో ఉన్న సంకోచం అంతా మాయమైంది.

'వాడు తన మాట కాదనడు. . .' ఎప్పటిమాదిరి ధైర్యంతో అనుకుంది.

"నువ్వింక ఉద్యోగంలో చేరవచ్చునుకుంటాను..."

భాస్కరం నవ్వాడు. "చేరచ్చు. . . దొరికితే. . ."

"అదేం మాట? ఇంత చదువు చదివి నువ్వే ఇలా అంటే. . ."

సిహెచ్. శాంతాదేవి

భాస్కరం ఇంకేం మాట్లాడలేదు.

"భానుకి పదిహేను నిండాయి. ఈ స్కూలు ఫైనల్ అయిపోతే ఇంక స్కూలు మాన్పించేస్తాము."

"అదేం కాలేజీలో చేర్పించరూ?"

"దానికి పెళ్లయి మొగుడికిష్టమైతే చదివించుకుంటాడు. . ." కామాక్షి నవ్వుతూ అంది.

భాస్కరం తల వంచుకుని ఏదో పుస్తకం పేజీలు తిరగేస్తున్నాడు. ఇంక అసలు విషయం బయట పెట్టాలనుకుంది కామాక్షి.

"ఈ వేసంగుల్లో తప్పితే మళ్లీ ఆరు నెలలకి గానీ ముహూర్తాలు లేవుట. నీ కెప్పుడు వీలవుతుందో చెప్తే. . ." ఆసక్తిగా తమ్ముడిమొహంలోకి చూస్తూ అన్నది.

భాస్కరం అర్థం కానట్టు చూశాడు.

"ఏరి సంగతి నువ్వు మాట్లాడుతున్నది?"

"ఇంకెవరూ? నువ్వు నీ కెప్పుడు వీలవుతుందో చెబితే, నాన్నగారితో మాట్లాడి ముహూర్తం పెట్టిస్తాను." పూర్వపు బింకంతోనే అన్నది. భాస్కరం రెండు నిమిషాలు ఏం మాట్లాడకుండా ఊరుకున్నాడు.

"వెనక ఒకసారి బావ అడిగితే చెప్పాను. నన్ను గురించి మీరేవో ఆశలు పెట్టుకున్నట్టున్నారు. . ." అని ఒక్కక్షణం ఆగాడు.

"నాకు భానుని చేసుకోవటం ఇష్టం లేదక్కయ్యా..." చేతిలో ఉన్న పుస్తకం పేజీలు తిరగెయ్యసాగాడు అక్కగారి మొహం చూడటానికి సాహసించలేక.

కామాక్షి దెబ్బతిన్నట్టు చూసింది. తను పెంచుకున్న ఆశలన్నీ కూలిపోతున్నట్టు తోచింది. 'ఇదేమిటే, వీడు ఇట్లా మాట్లాడతాడు?' అనుకుంటూంది మనస్సులోనే.

"చిన్నతనంలో ఈ విషయం పెద్దగా పట్టించుకోలేదు గానీ, ఈ మధ్య అమ్మా వాళ్ళ మాటలు, నీ మాటలూ నాకో అనుమానాన్ని కలిగించాయి. అయినా నన్ను ఎవరూ అడగందే నేను తొందర పడటం దేనికని ఊరుకున్నాను. ఇప్పుడు సమయం వచ్చింది గాబట్టి చెబుతున్నాను. . ." అప్పటికి తేరుకుంది కామాక్షి

"అదేమిటి భాస్కరం, చిన్నప్పట్నించీ మీ ఇద్దర్నీ ఒకటి చెయ్యాలని నే నెంత అనుకున్నాను! నాన్నా వాళ్ల ఉద్దేశంకూడా అదే! నీ అభిప్రాయంకూడా అంతేనని నే నిప్పటివరకూ నమ్మాను. . ." కామాక్షి కంఠంలో మునపటి ధైర్యం లేదు. ఓడిపోయినట్టుగా ఉన్నది ఆమె చూపు.

"నన్ను క్షమించు అక్కయ్యా. నీకు తెలీదు గానీ భానుమీద చిన్నతనంనించీ నాకు ఆపేక్ష, అత్యంత ప్రేమ ఉన్నాయి. కాదను. . . అయితే దానితో ఇటువంటి సంబంధానికి అంగీకరించాలంటే నా కెంత బాధగా ఉన్నదో!. . . నువ్వు నమ్మవు గానీ భానుని తోబుట్టువులా ఆదరించాను ఇన్నాళ్లూ. . ." భాస్కరం మెల్లిగా అన్నాడు.

కామాక్షికి ఏం మాట్లాడాలో తోచలేదు. తల వంచుకుని అలాగే కూర్చుంది. ఆమె భాస్కరం మాటల ధోరణికి తట్టుకోలేకుండా ఉన్నది. వాడిని కనీసం ఒక్క మాటైనా అడక్కుండా తనలో తాను అనుకోవటం తనదే తప్పేమోననిపిస్తోంది.

అక్కయ్యని చూసేసరికి ఒక విధమైన జాలి పొంగింది భాస్కరంలో.

"మన్వేమీ బాధపడకు అక్కయ్యా. భానుకి మంచి సంబంధం చూసి చెయ్యండి. . ." తన మాటలు తనకే వికృతంగా తోచాయి. అక్కయ్య మనసు ఏ విధంగానైనా శాంతిస్తుందంటే ఆ పని తక్షణం చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు. కానీ, ఈ విధంగా కాదు. తన మనసులోదంతా ఇప్పుడే చెప్పేస్తే మంచిది.

"నే నింకో విషయంకూడా నిర్ణయించుకున్నా నక్కయ్యా." కామాక్షి ఏమిటన్నట్టు చూసింది.

భాస్కరం ఒక్క క్షణం తటపటాయించి, చివరికి అన్నాడు.

"నా పెళ్లి విషయం. . ."

కామాక్షి వింతగా చూసింది.

"అంటే. . ." అంది ప్రశ్నార్థకంగా చూస్తూ.

"నేను అక్కడే ఒక సంబంధం నిశ్చయం చేసుకు వచ్చాను. అయితే వాళ్లు చాలా బీదస్థితిలో ఉన్నారనుకో. కానీ అదొక్కటే అడ్డు వస్తుందంటావా?" తల వంచుకుని మాట్లాడుతున్నాడు.

కామాక్షికి ఏం చెప్పటానికీ మాటలు రావడం లేదు. అయినా గొంతు పెగుల్చుకుని

"అయితే, ఆ పిల్ల?. . ." అంది.

"మరేం ఫర్వాలేదు. మనవాళ్లే."

కాసేపు మాట్లాడలేకపోయింది కామాక్షి. ఆమెకి ఈ విషయం విన్నాక సంతోషించాలో, విచారించాలో తెలీటం లేదు.

ఇన్నాళ్లనించీ ఎన్ని ఆశలతో జీవించింది! పిల్లకి పెళ్లికాక పోదు. కానీ బంధుత్వాలూ, ఆదరణలూ తెంచుకోవటం సులభమే! దృఢతరం కావటమే కష్టం. తన మాటమీద ఏమాత్రమన్నా గౌరవం ఉంటే వాడిలా మాట్లాడతాడా? తను ఊహించినవన్నీ వట్టి భ్రమలు!. . .

"నీకు తెలీదు గానీ, మన భాను ఇష్టపడింది ఈ పెళ్లికి. నేనుకూడా నువ్వు తప్పకుండా ఒప్పుకుంటావనే నమ్మకంతో ఉన్నాను. ముఖ్యంగా అమ్మావాళ్ల మనస్సు బాధపెట్టినవాడవవుతావు . . ." కామాక్షి చివరిసారిగా ప్రయత్నించింది మనసులో ఆశచంపుకోలేక,

"ఇదేం బొమ్మలపెళ్లి కాదు. సినిమా అంతకన్నా కాదు, త్యాగాలు చెయ్యటానికి. నువ్వు స్వార్థంగా మాట్లాడకు అక్కయ్యా! నావరంకూడా ఆలోచించు. అసలు ఈ విషయం ముందుగా నాకు తెలిస్తే ఇంత దూరం వచ్చేది కాదు. . ." అతని కంఠంలో కొద్దిగా కోపం తొంగిచూసింది. తన మనసు విప్పి చెప్పినా అర్థం చేసుకోదేం?

"నేనూ అదే అనుకుంటున్నా."

ఇద్దరూ ఇంకేం మాట్లాడుకోలేదు.

. . . గదిలో నిలబడి ఇద్దరి సంభాషణా వింటున్న భాను నెమ్మదిగా కదిలి వెళ్లిపోయింది. . .

భాస్కరం వెళ్లిపోయాడు . . తరవాత రెండేళ్లకి తిరిగి వచ్చాడు, భార్యతో సహా. అతను పెళ్లి తిరపతిలో చేసుకున్నాడు. కారణం పెద్దగా ఏం లేదు గానీ. . . అతను ముందుగానే అల్లా అనుకున్నాడు. భాస్కరం తల్లిదండ్రులు ఈ పెళ్లికి ఏమంత సుముఖంగా లేకపోయినా ఉన్న ఒక్క కొడుకు మనసు బాధపడటం వాళ్ల కిష్టం లేదు. అదీగాక పిల్ల అందం, వినయం విధేయతా చూసి సమాధానపడ్డారు. ఏ వరకులందాన్నా తెచ్చినా ఊరుకోవలసిందే గదా! అందుకే వాళ్లు సమాధానపడ్డారు చేసేది లేక. ఈ రెండేళ్లలో చెప్పుకోదగ్గ మార్పు లేం జరగలేదు. భాస్కరం భార్యని తీసుకుని అక్కగారింటికి వచ్చాడు. అతడు భానుని చూశాడు. ఆమె ఎప్పటి మాదిరిగానే ఉంది. ఇంకా పెళ్లి కాలేదని తెలుసుగానీ. . . భానుని చూడగానే మనసులో ఏదో కెలికినట్లయింది. ఎవరూ లేకుండా చూసి అక్కయ్య నడిగాడు.

"భానుకు సంబంధాలు చూస్తున్నారా?"

కామాక్షి నవ్వింది. భాస్కరం తప్పుచేసినవాడిలా తలవంచుకున్నాడు.

"అది మళ్లీ చదువు మొదలెట్టింది."

". . . . . . . . . . ."

"ఒకసారి నాన్న ఏదో సంబంధం మాట్లాడితే తను ఇప్పట్లో పెళ్లి చేసుకోనని చెప్పింది. ఎదిగిన పిల్ల, ఇష్టం లేకుండా ఎలా చేస్తామూ?" అక్కయ్య మాటలు వింటూ మౌనంగా ఊరుకున్నాడు.

'జరిగిందేదో జరిగిపోయింది. వాడూ పెళ్లి చేసుకున్నాడు. అయినా ఎవరి కెక్కడ రాసి పెడితే, అక్కడ జరుగుతుంది. మన చేతుల్లో ఉన్నదా? ఉన్నదే ఒక్కడు. . . వాడెప్పుడూ సుఖంగా ఉండాలని కోరుకోవాలి తను. ఎందుకు వృథాగా కక్షలు పెంచుకోవటం?. . .' ఈ విధంగా ఆలోచించి కామాక్షి తమ్ముణ్ణి వెనకటంత ప్రేమగానూ చూడసాగింది.

భాస్కరం ఒక్కసారి భానుతో మాట్లాడాలని ప్రయత్నించాడు గానీ, ఎన్నిసార్లు పలకరించినా ఏదో రెండు ముక్కలు మాట్లాడి తప్పించుకు పోయేది భాను.

* * *

మనుషులెట్లా ఉన్నా, పరిస్థితులేం మారినా, కాలం మాత్రం ఆగదు. భాస్కరం జీవితంలో విధి వక్రించింది. ఎన్నడూ ఎదురు చూడని విపరీత పరిణామాలను ఎదుర్కోవలసి వచ్చింది.

. . . ఒక చేతిలో రెండేళ్ల పాప నెత్తుకుని మెల్లిగా గుమ్మంలో అడుగు పెడుతున్న తమ్ముడివేపు చూస్తూ చుట్టూ పరిసరాలు మరిచిపోయింది కామాక్షి. మరుక్షణంలో కళ్లనిండా నీళ్లు తిరిగి చెంపలమీదుగా జారాయి. భాస్కరం చేతిలో పాపని తీసుకుని లోపలికి నడిచింది. భాస్కరం లోపలికి వచ్చి కూర్చున్నాడు. 'ఎంత మారిపోయాడు భాస్కరం! నిండా ముప్ఫయి ఏళ్లయినా లేక అప్పుడే జీవితంలో కష్టాలు మొదలు.'

"నీ కెంత కష్టం తమ్ముడూ. ఈ పసికూనని పెట్టుకుని ఎల్లా గడుపుతావు?" కన్నీళ్లతో అడిగింది కామాక్షి.

భాస్కరం మాట్లాడలేదు.

"ఏ దురదృష్టదేవతో నెత్తిమీద కూచుని ఆడుతూంది. పెద్దతనం వచ్చి వాళ్లా, వయసులో ఉన్నవాడివి నువ్వూ. . . ఏం పాపం చేసుకున్నారనీ. . ." అక్కయ్య మాటలు వింటూ మౌనంగా కూర్చున్నాడు భాస్కరం. అతని మొహంలో విచారం లేదు. బాధ లేదు. కళ్లు శూన్యంలోకి చూస్తున్నాయి. అన్నీ పోగొట్టుకున్న నైరాశ్యం కనిపిస్తుంది ఆ కళ్లల్లో, 'ఇంక ఎందుకు బ్రతకాలి' అన్న విరక్తి నిండి ఉంది అతని మనసులో.

"నాన్న వచ్చి కబురు చెప్పేదాకా తెలీదు. విజంగా



బొమ్మల కొలువు
ఫోటో—ఎమ్. ఆర్. వెంకట్రామన్
(మద్రాసు-4)

ఎంత ఆశ్చర్యం వేసిందనీ. . . ఏమంత వయసు వచ్చిందనీ, ఏ జబ్బూ లేకుండా. . . అంతా పిల్ల చేసుకున్న దురదృష్టం. . ." పసిదాని చెంపలు నిమురుతూ కళ్లు తుడుచుకుంది కామాక్షి.

"భానూ, కులాసానా?" తనని పలకరిస్తున్న మామయ్యవేపు చూడలేకపోయింది భాను. అతన్ని ఓదార్చటానికి తనకు శక్తి లేదు. ప్రేమించి చేసుకున్నాడు. కొన్నాళ్లయినా సుఖంగా గడిపే యోగ్యత లేకపోయింది. తన సానుభూతి ఏ విధంగా చూపగలుగుతుంది? మెల్లిగా తల ఎత్తి అతని కళ్లల్లోకి చూసింది. అతని దృష్టి ఎక్కడో ఉంది. నిట్టూర్చింది భాను. అంతే! భాస్కరం వెళ్లిపోయాడు పాపని తల్లి దగ్గిర వదిలి పెట్టి. పిచ్చెక్కినవాడిలా ఊళ్లన్నీ తిరిగాడు, మనశ్శాంతి కోసం. అదీ చాలా దూరంగా ఉండిపోయింది అతనికి. . . తరవాత, ఎవరూ గుర్తుపట్టలేని విధంగా తయారయి వచ్చాడు.

తల్లి శోకాలు పెట్టింది అతని రూపం చూసి.

"అది చచ్చి సహం ఏడుస్తుంటే, నువ్వుకూడా మాకు లేకుండా పోతావ్రట్రా ... చూడు. ఈ పిల్లదాని మొహం చూడు. . ."

భాస్కరం చూశాడు నాలుగేళ్ల సుగుణని. అతనిలో జాలి పొంగింది. కూతుర్ని చూస్తున్నకొద్దీ మనస్సంతా ఎన్నడూ ఎరగని ఆవేదనలో మునిగిపోయింది. తల్లి లేక, తండ్రి దూరమయి దిక్కు లేకుండా బతుకుతున్న కూతుర్ని చూసి అతని మనసు బాధతో మూలిగింది. "ఏం పాపం చేసుకుందనీ ఈ శిక్ష!". . . చాలా రోజుల తరవాత ఒక నిశ్చయానికి వచ్చాడు. తనకోసం ఆ ఇంటి తలుపులెప్పుడూ తెరిచే ఉంటాయన్న నమ్మకంతో అతను ధైర్యం చేసి బయటపెట్టాడు తన మనసులోమాట. . . అది ఎవరిముందో కాదు. . . భానుతో.

. . ."నన్ను క్షమించు భానూ. . . నీ జీవితం ఈ విధంగా అయిపోవటానికి నేనే కారణం. . ." పశ్చాత్తాప స్వరంతో అంటున్న భాస్కరం వేపు సూటిగా చూసింది భాను.

". . . . . . . . . ."

"నేను చేసిన తప్పిదానికి ఫలితం ఇంత దారుణంగా

ఉంటుందనుకోలేదు. . . నువ్వు ఒక విధంగా నన్నే శిక్షిస్తున్నావు భానూ.''

భాను వింతగా చూసింది.

''నువ్వు ఆ విధంగా ఏమీ బాధపడకు మామయ్యా! ఇందులో నీ తప్పు ఉన్నదని నే నింతవరకూ అనుకోలేదు. అంతా నా దురదృష్టం అని మాత్రం అనుకుంటున్నాను. ఇందులో ఎవరి ప్రమేయమూ లేదు. . .'' ఆమె మాటల్లో కాఠిన్యం స్పష్టంగా తొంగి చూసింది.

''నువ్వు ఎన్నాళ్ళు ఈ విధంగా ఒంటరి జీవితం గడుపుతావు?'' సాహసించి అడిగాడు.

భాను తల వంచుకుంది. పాతికేళ్ళ పైబడ్డ భానుమొహంలో డెబ్బయి యేళ్ళ అనుభవాలు తొంగిచూశాయి.

''నావల్ల నీ జీవితం నాశనమైపోవటానికి వీల్లేదు.'' ఆవేశంగా అన్నాడు. భాను విషాదంగా నవ్వింది.

''ఎవరివల్లా నా జీవితం ఏమీ అయిపోలేదు మామయ్యా!'' ఒక్క క్షణం ఆగి అన్నది. ''తెలిసీ తెలియని వయసులో ఒక కల కన్నాను. అది రంగు రంగుల కల. గడిచిందంతా ఒక మధుర స్వప్నం. అంతే! నా జీవితంలో ఇంకేమీ మిగలలేదు. గడిచిన స్మృతులు తలచుకుంటూ గడపటంలోనే మిగిలిన కాలం వెళ్ళిపోతుంది. ఏమైనా కోర్కెలంటూ ఉంటే కదూ మావయ్యా, పెళ్ళి, సంసారమూనూ. . .'' భాను మెల్లిగా అంటుంటే ఆమె మొహంవేపు చూడలేకపోయాడు భాస్కరం. దోషిలా తల వంచుకున్నాడు. 'తనవల్లే ఆమె ఆ విధంగా అయిపోయింది' అన్న భావం అతన్ని కుంగదీస్తోంది.

తల వంచుకుని కూర్చున్న భాస్కరాన్ని చూసి సానుభూతిగా అతని చేతిమీద చెయ్యి వేసి నిమురుతూ,

''నువ్వు నా గురించి బాధపడకు మామయ్యా! నా మార్గం నేను నిర్ణయించుకున్నాను. నీ ముందు జీవితం గురించి ఆలోచించుకో.''

''ఏమిటి భానూ,నీ మార్గం?'' ఆసక్తిగా అడిగాడు.

''నా హృదయమంతా మొద్దుబారి పోయింది. నే నింకా ప్రాణాలతో బ్రతికి ఉన్నానంటే, ఆ మోడువారిపోయిన చెట్టుకి ఎంత విలువో నాకూ అంతే. నేను బ్రతికినా ఎవరికీ ప్రయోజనం లేదు. నాలో జీవం ఉన్నా నా మనసు ఒక రాతితో సమానం అయిపోయింది. . .'' ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అవి బయటికి రాకుండా అదిమి పట్టుతూ భాస్కరం వేపు ఆప్యాయంగా చూసి అన్నది.

''నీ జీవితం పాడుచేసుకోకు మామయ్యా. సుఖపడటానికి ప్రయత్నించు. . .'' భాస్కరానికి ఆమె మాటలు వింటుంటే తన మనసులో కోర్కె బయట పెట్టే సాహసం లేకపోయింది. ఆమె మొహంలోకి తదేకంగా చూస్తూ అలాగే కూర్చున్నాడు. . .

* * *

. . .రైల్లో కూర్చున్న భాస్కరం కిటికీలోనించి బయటికి శూన్యాకాశంలోకి చూస్తున్నాడు. 'రైలు చేరవలసిన చోటు చేరుతుంది ఎప్పటికైనా. కానీ నా జీవితానికి గమ్యం అగమ్యగోచరంగానే ఉంది...' విచారంగా నిట్టూర్చాడు. ★





ఇంటిల్లిపాదికీ

అజంతా

టూత్‌బ్రష్‌లు.

పెద్దలనుంచి, పిల్లల వరకూ ప్రతి ఒక్కరి కోసం ప్రత్యేకంగా ఒక టూత్‌బ్రష్. ప్రత్యేకంగా ఎంచిన నైలాన్ బ్రిసల్స్ నుంచి కుంచెలు తయారు చేసారు. మీ పండ్లను చక్కగా పరిశుభ్రం చేసేలాగు, ముఖ్యంగా టార్టార్ జమకూడే సందులను చేరేలా ఈ కుంచెలు తయారుచేసారు.

పరిశుభ్రత కోసం-పారిశుధ్యానికి ఈ బ్రషులను ప్లాస్టిక్ పెట్టెలలో పేక్ చేసారు.

ఇంకా వారివేవి:

అజంతా షేవింగ్ బ్రష్, అజంతా హెయిర్ బ్రష్

మరియు 25 మరియు లాంగ్ హెడ్ , హార్డ్, మీడియం, సాఫ్టు రకాలలో.

హేండలు మరియు కంటైనర్ డిజైనులు రిజిష్టరు చేయబడినవి.

ది బోంబే బ్రష్ కం. ప్రయివేట్ లి.

బొంబాయి-34.

RATAN BATRA /BB/TEL/09A